క్లుప్తంగా

రేషన్ వినియోగదారులంతా ఈ-కేవైసీ చేయించుకోవాలి

కొత్తపేట: తెలుపు రేషన్ కార్డుల్లో సభ్యులందరూ విధిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ వై.రాంబాబు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఈ-కేవైసీపై చౌక డిపో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని తెలుపు రేషన్ కార్డుల్లో సభ్యులైన 3,884 మంది ఇంకా ఈ-కేవైసీ చేయించుకోవలసి ఉందన్నారు. వారంతా ఈ నెల 30వ తేదీ లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలని, లేని పక్షంలో వారందరికీ ప్రతి నెలా ప్రభుత్వం నుంచి వచ్చే నిత్యావసరాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితి తలెత్తకుండా వారందరూ సంబంధిత రేషన్ డీలరు లేదా, సమీపంలో ఉన్న డీలర్ వద్దకు వెళ్లి ఈపీఓఎస్ మెషీన్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంఎస్ఓ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్ఐ పి.రవిశంకర్, వీఆర్ఓలు, మండలంలో చౌక డిపో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

బహుళ పంటల సాగుతో జీవ వైవిధ్యం

రాజోలు: బహుళ పంటల సాగుతో జీవ వైవిధ్యం మెరుగు పడుతుందని ప్రకృతి వ్యవసాయ తాటిపాక యూనిట్ ఇన్‌చార్జి పోతురాజు ప్రసన్నకుమార్ అన్నారు. మంగళవారం ప్రకృతి వ్యవసాయం చేపట్టడం వలన కలిగే లాభాలను వివరిస్తూ వేగివారిపాలెంలో సర్పంచ్ పప్పొప్పుల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామసభ ఏర్పాటు చేశారు. ఉత్తమ రైతులను గుర్తించి వారిని సత్కరించారు. పీఎండీఎస్ విత్తనాల కిట్లను సర్పంచ్ వెంకటలక్ష్మి రైతులకు అందజేశారు. నవధాన్యాల సాగు చేయడం వలన భూమిలో కర్బనం పెరిగి నేల గుల్లబారుతుందన్నారు. దీంతో ఆ భూమిలో నీటి నిల్వ శాతం అధికంగా ఉండి వానపాములు వృద్ధి చెందుతాయన్నారు.

మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



నగరంలో మొక్క నాటుతున్న విద్యార్థినులు

మామిడికుదురు: ప్రపంచ ధరిత్రీ దినోత్సవంలో భాగంగా నగరం జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం మొక్కలు నాటారు. మొక్కలు నాటడం వల్ల వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయని, వాతావరణం సమతుల్యంతో వర్షాలు కురుస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ, జక్కంపూడి శివప్రసాద్ తెలిపారు. తద్వారా భూమి సస్యశ్యామలం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు వాసంశెట్టి నాగరాజు, అడబాల ఈశ్వరరావు, కడలి మురళీశ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. అంబాజీపేట నాగమల్లిచెట్టు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం వాడ్రేవు సూర్యనారాయణ అధ్యక్షతన వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ 85 మంది విద్యార్థులతో మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తింపు వచ్చిందన్నారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో మైలా ఆనందరావు, ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఎస్ఎంసీ చైర్మన్ దిగుమర్తి లక్ష్మి, సీఆర్పీ వెంకటేష్, ఉపాధ్యాయులు ఎంవీఎస్ కుమారి, పి.వరలక్ష్మి, ఎం.సత్యవేణి, కె.శ్రీదేవి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు



సంధిపూడి కంటి వైద్య శిబిరంలో సేవలను అందిస్తున్న వైద్యులు

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య బృందం ఏర్పాటు చేసిన ఈ కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ తోట భవాని ప్రారంభించారు. ఈ శిబిరానికి పరిసర ప్రాంతాల నుంచి 103 మంది రోగులు వచ్చి కంటి పరీక్షలను చేయించుకున్నారు. అందులో 20 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి మెరుగైన చికిత్స నిమిత్తం కపిలేశ్వరపురం కంటి ఆస్పత్రికి తరలించారు. అలాగే పలువురు రోగులకు ఉచితంగా కళ్లజోళ్లు, మందులను ఉచితంగా అందజేశారు. తోట వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.వీర్రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంతన్నారు.. ఇంతన్నారు..

- సంక్రాంతికి రోడ్లన్నారు.. ఆపై మాట మరిచారు
- అధ్వానంగా ప్రధాన రోడ్లు
- ప్రజలకు తప్పని పాట్లు



దారుణంగా ఉన్న శంకరగుప్తం-తూర్పుపాలెం సముద్రతీరం రోడ్డు



అర్ధాంతరంగా నిలిచిపోయిన చింతలపల్లి-లక్కవరం ఆర్అండ్‌బీ రోడ్డు

మలికిపురం: అంతన్నారు.. ఇంతన్నారు.. సంక్రాంతికి రోడ్లన్నారు.. కూటమి ప్రభుత్వం మాటలు నమ్మారు. తీరా చూస్తే అరకొరగా రోడ్ల నిర్మాణం. ప్రధాన రహదారుల మాట గాలికి వదిలేశారు. పోనీ వేసిన రోడ్లేమైనా బలంగా వేశారా అంటే అదీ లేదు. గోతుల పూడ్చి తారు వేశారు. వచ్చే వర్షాకాలంలో వీటి బండారం బయట పడుతుంది. ఇది కూటమి నేతలే చెవులు కొరుక్కుంటున్న మాట. రాజోలు దీవిలో రోడ్ల స్థితి ఇది. నియోజకవర్గంలో ప్రధాన రహదారుల్లో ఒకటైన చింతలపల్లి వయా లక్కవరం, మలికిపురం రోడ్డు పూర్తిగా పాడైపోయింది. గత ఎన్నికల నాటికే గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సుమారు రెండు నెలల క్రితం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఈ రోడ్డు మంజూరు దస్త్రం బయటకు తీసి పనులు ప్రారంభింపజేశారు. వెడల్పు చేసేందుకు రోడ్డు సైడ్ బెర్మ్‌లు తవ్వి వదిలేశారు. సుమారు 2.50 కోట్లతో ఈ పనులు ప్రారంభించి అర్ధాంతరంగా వదిలేశారు. దీంతో అసలుకే ఎసరు వచ్చి ప్రయాణం మరింత జటిలమైంది. మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు ప్రధాన రవాణా మార్గం ఇదే. బస్సులు తిరిగే మార్గం ఇదే. దీంతో ప్రజలు నరకం చూస్తున్నారు. కేఎస్ఎఫ్ రోడ్డు. ఇది మలికిపురం నుంచి సఖినేటిపల్లి రేవు వరకూ మిక్కిలి అధ్వానంగా ఉంది. అత్యంత ఇరుకు, ఇటీవల కేవలం గోతులు పూడ్చారు. అది కూడా నాసిరకంగా పనులు చేశారు. ఇక అంతర్వేది పుణ్యక్షేత్రం నుంచి దండు పుంత మీదుగా వుయ్యూరి వారి మెరక, కత్తిమండ, చింతలపల్లి మీదుగా బి.సావరం, సోంపల్లి వరకూ గల 34 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు అత్యంత ప్రమాదకరంగా ఉంది. నియోజకవర్గంలో పెరిగిన రవాణా అవసరాల నేపథ్యంలో సుమారు పది గ్రామాలలో విస్తరించి ఉన్న రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. కానీ అభివృద్ధి లేదు. ఇక సముద్రతీర ప్రాంతంలో వాణిజ్య అవసరాలతో పాటు ప్రజల దైనందిన కార్యక్రమాల రాకపోకలకు అత్యంత ప్రాధాన్యం కలిగిన శంకరగుప్తం పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం సముద్ర తీర ప్రాంత రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ఇది పూర్తిగా పునర్నిర్మాణం చేయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. సఖినేటిపల్లి మండలంలో శృంగవరప్పాడు, ఉయ్యూరి వారి మెరక ఆర్అండ్‌బీ రోడ్డు కూడా ధ్వంసమైంది. రామరాజులంక-దిండి ఆర్అండ్‌బీ రోడ్డు, పెదతిప్ప రోడ్డు, మలికిపురం-రామరాజులంక ఏటిగట్టు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. రామరాజులంక-అంతర్వేది-వయా గుడిమూల రోడ్డులో అప్పనరామునిలంక, కొత్తలంక రోడ్డు అత్యంత ప్రమాదకరంగా ఉంది. లక్కవరం గూడపల్లి రోడ్డు, ములికిపల్లి, పొన్నమండ, కాట్రేనిపాడు, ముత్యాలపల్లి-గోగన్నమఠం రోడ్డు పూర్తిగా పాడైపోయింది. శంకరగుప్తం బట్టేలంక రోడ్డు ఊసేమరిచారు. చింతలమోరి పల్లిపాలెం మీదుగా శృంగవరప్పాడు రోడ్డు కూడా గుర్తు లేదు. ఇలా నియోజకవర్గంలో సుమారు 100 కిలోమీటర్ల ప్రధాన రోడ్లు మిక్కిలి అధ్వానంగా ఉన్నాయని అధికారులు అంచనా. ఎప్పటికి అభివృద్ధి జరుగుతాయోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

జగన్‌ను కలసిన కోఆర్డినేటర్ శ్రీనివాసరావు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన శ్రీనివాసరావు

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పి.గన్నవరం నియోజకవర్గం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ని కలిశానని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించానన్నారు. నియోజకవర్గం బాధ్యతలు తనకు అప్పగించడం జరిగిందని, ఎటువంటి సమస్యలు ఏర్పడినా తన దృష్టికి తీసుకురావాలని జగన్ సూచించారన్నారు. పార్టీని ముందుకు నడిపించాలని జగన్ పేర్కొన్నారని, ఆయన సూచనల మేరకు పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళ్లానన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



అంతర్వేది దేవస్థానం గ్రామంలో గర్భిణికి సీమంతం చేస్తున్న సర్పంచ్‌లు, రమాదేవి

అంబాజీపేట: పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే తల్లీబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, వైద్యాధికారి సూర్యనగేష్ అన్నారు. మాచవరం పండువారిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీఎస్‌వీ మహాలక్ష్మి అధ్యక్షతన పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా పోషణ్ పక్వాడా వేయి రోజుల సంరక్షణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన పదార్థాలు తీసుకోవడం వల్ల రక్తహీనతకు దూరంగా ఉంటామన్నారు. ఆకుకూరలు, పప్పుదినుసులు, పళ్లను తీసుకోవాలన్నారు. అనంతరం పోషక విలువలు కలిగిన వాటితో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గోసంగి సత్యనారాయణ, కొల్లి సత్యవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

అంతర్వేది దేవస్థానం గ్రామంలో..

సఖినేటిపల్లి: రాజోలు ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో అంతర్వేది దేవస్థానం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా పేరుతో పోషకాహార ఆవశ్యకతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సులో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలను దేవస్థానం సర్పంచ్ కొండా జాన్‌బాబు, పల్లిపాలెం సర్పంచ్ ఒడుగు శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీఓ వైకేడీ రమాదేవి నిర్వహించారు. సదస్సులో రమాదేవి మాట్లాడుతూ, పోషకాహారం తీసుకోవడంపై గర్భిణీలుకు, బాలింతలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాశర్లపూడిలంకలో..

మామిడికుదురు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని పాశర్లపూడిలంక, నగరం, అప్పనపల్లి గ్రామ సర్పంచ్‌లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, జాలెం రమణకుమారి, గెద్దం మంగాలక్ష్మి తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా మంగళవారం ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో పౌష్టికాహారం ప్రాధాన్యతను తల్లులు, బాలింతలకు వివరించారు. పెదపట్నంలంక, పాశర్లపూడి, మగటపల్లి, గ్రామాల్లో కూడా పోషణ పక్వాడా కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.అన్నపూర్ణ, ఎన్.సుబ్బలక్ష్మి, పి.విజయలత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మండల బీసీ ఉద్యోగ సంఘ కమిటీ ఎన్నిక



ఎన్నికైన బీసీ ఉద్యోగ సంఘ నూతన కమిటీ

రాజోలు: మండల బీసీ ఉద్యోగ సంఘ అధ్యక్షుడిగా దొంగ సత్యనారాయణ ఎన్నికయ్యారు. మంగళవారం రాజోలు శెట్టిబలిజ కమ్యూనిటీ హాలులో జిల్లా సంఘ అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. మండల సంఘ గౌరవ అధ్యక్షుడిగా బిళ్ల రాచయ్య, ప్రధాన కార్యదర్శిగా రేవు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా గుబ్బల సత్యనారాయణ, టి.శ్రీనివాస చక్రవర్తి, ఆర్థిక కార్యదర్శిగా దొమ్మేటి శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా బి.బృహస్పతి, మట్టపర్తి నరసింహారావు, నగరం పుల్లయ్య, ఎ.దుర్గాప్రసాద్, జిల్లా కౌన్సిలర్‌గా కట్టా జగన్మోహనరావులు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కారాడి వెంకట నరసింహరాజు వ్యవహరించారు. నాయకులు పితాని వెంకటేశ్వరరావు, ఎ.రవికుమార్, కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ఠ



మలికిపురంలో జరిగిన ఆలయ ప్రతిష్ఠ హోమాల్లో పాల్గొన్న భక్తులు

మలికిపురం: స్థానిక ఎత్తు వంతెన వద్ద ప్రజా విరాళాలతో నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయ విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న అయ్యప్ప స్వామి, విఘ్నేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అష్ట లక్ష్మీదేవి, మాళికా పురత్తమ్మ విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ, కరుత్త స్వామి, ఆలయ శిఖర పతిష్ఠ కార్యక్రమాలు, హోమాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారంతో ప్రతిష్ఠా కార్యక్రమాలు ముగియనున్నాయి. మంగళవారం అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక హోమాలు, స్తోత్ర పారాయణలు, ధాన్యాధివాసం, అష్టాదశాధిష్టా దేవార్చనలు నిర్వహించారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు-దుర్గాభవానీ దంపతులు, గుండుబోగుల రాము-ఉమామహేశ్వరి దంపతులు, తాడి శ్రీనివాసరెడ్డి-కమల దంపతులు, వైద్యులు జేవీబీ ప్రసాద్-ఉమాదేవి దంపతులు, కేసీఎంఎల్ శ్రీనివాస్-విజయలక్ష్మి దంపతులు, పంతాల భాస్కర శ్రీనివాస్-ధనలక్ష్మి దంపతులు, తాడి వెంకట త్రిమూర్తులు-వెంకటలక్ష్మి దంపతులతో అయ్యప్ప స్వామితో పాటు ఉపాలయాల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాల పూజలు వైభవంగా జరిగాయి. చుట్టపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

40 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలో 40 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎక్సైజ్ దాడుల్లో ఆత్రేయపురం మండలం రాజవరం గ్రామానికి చెందిన కోమలి సతీష్ వద్ద 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసి రాజోలు కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా స్వామివార్ల మాస కల్యాణం



ర్యాలిలో జగన్మోహినీ కేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న ఈఓ రమణమూర్తి, పండితులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి మాస కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువలా జరిపించారు. వసంత రుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, నవమి, శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవిలతో బాలబాలాజీ స్వామి పరిణయోత్సవాన్ని కన్నుల పండువలా జరిపించారు. పలువురు భక్తులు స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నుల పండువలా జరిగింది.

జగన్మోహినీ కేశవస్వామి మాసకల్యాణం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవస్వామివారి శ్రవణ నక్షత్ర మాస కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితులు ఆధ్యాత్మిక వ్యాఖ్యానం నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. దేవస్థానం తరఫున ఈఓ రమణమూర్తి పట్టు వస్త్రాలు సమర్పించగా, పలువురు భక్తులు కూడా పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ర్యాలి పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



పుల్లేటికుర్రులో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

అంబాజీపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించుకొని లబ్ధి పొందాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ అన్నారు. పుల్లేటికుర్రులో ప్రారంభమైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో మంగళవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ మండలంలో 2,924 ఎకరాల్లో వరి సాగు చేశారని, ఇప్పటి వరకు 70 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని 40 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని వివరించారు. రబీలో ఎకరాకు దిగుబడి 45 బస్తాల వంతున లభించిందని క్వింటాల్‌కు మద్దతు ధర సాధారణ రకం రూ.2,300 వంతున ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చన్నారు. ఆర్డీవో వెంట ఇంచార్జి తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ ఏడుకొండలు, వీర్వోలు, వీఏవోలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అంబాజీపేట: నేటి యువత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. పే బ్యాక్ టు సొసైటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పోటీ పరీక్షలను కన్వీనర్ నక్కా భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించి మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను నగదు, షీల్డ్, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్, నాయకులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నిర్మూలనే లక్ష్యం



తాటిపాకలో డెంగీ, మలేరియా పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అధికారి వెంకటేశ్వరరావు

రాజోలు: కీటక జనిత వ్యాధుల నిర్మూలనే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది విధులు నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన తాటిపాక పీహెచ్‌సీని సందర్శించారు. పీహెచ్‌సీ తనిఖీ చేసిన వెంకటేశ్వరరావు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా నిర్మూలన కోసం చేస్తున్న వ్యాధి నిర్ధారణ పరీక్షల విధానాన్ని పరిశీలించారు. గ్రామాల్లో డెంగీ, మలేరియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, దానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. పీహెచ్‌సీకి విచ్చేసిన వెంకటేశ్వరరావును వైద్యాధికారి డాక్టర్ ఫణికిరణ్ ఘనంగా సత్కరించారు. సీహెచ్ఓ ఎం.ఎలిజబెత్, పీహెచ్ఎన్ ఎ.సత్యవతి, ఎంపీహెచ్ఓ త్రినాథరావు, సూపర్‌వైజర్ మద్దాల శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎం.రాజశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ త్రినాథ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో..

మామిడికుదురు: డెంగీ, మలేరియా వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని కోనసీమ జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. ఆయన మంగళవారం నగరం పీహెచ్‌సీని సందర్శించారు. ల్యాబ్‌ను పరిశీలించారు. డ్రైడే, ఫ్రైడే ప్రాధాన్యతను వివరించారు. మలేరియా రక్తపూతలు తీసే విధానం, సాంకేతిక లోపాలపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.స్వర్ణలత, సీహెచ్ఓ కెఎస్ సత్యవతి, పీహెచ్ఎన్ బి.జయకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ బీవీవీ సత్యనారాయణ, ఎల్‌టీ బీవీఎస్ఎస్ మూర్తి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: ఈనెల 25న నిర్వహించే జాతీయ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మలేరియా, డెంగీ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ ముద్రించే పోస్టర్స్, కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల ఆవరణలో వైద్యాధికారులు కె.శ్రీకాంత్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కొత్తపేట డివిజనల్ మలేరియా యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. దోమల వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ వ్యాధుల నివారణకు తీసుకోవలసిన చర్యలను సమగ్రంగా వివరించారు. అనంతరం మలేరియా, డెంగీ జ్వరాల పోస్టర్స్, కరపత్రాలను ఆయా పీహెచ్‌సీల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఆవిష్కరించారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలామణి, ఫార్మసిస్టు డి.సుగుణలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీరు అందించండి



సమావేశంలో తాగునీటిపై చర్చిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

మామిడికుదురు: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు అధికారులకు సూచించారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల ఉద్యోగులతో పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా తాగునీటి సమస్యపై చర్చించారు. వేసవి కాలంలో ఏ ఒక్కరూ తాగునీటి సమస్యతో ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అధికారులు సూచించిన విధులు, బాధ్యతలను గడువులోగా పూర్తి చేయాలని ఉద్యోగులకు వివరించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీటికి వేసవి గండం

- ఎమ్మెల్యే దేవ ఆందోళన
- పంపింగ్‌కు వనరులు పెంచాలని ఆదేశం



గుడిమెళ్లంక రిజర్వాయర్‌లో ఇన్‌టేక్ వెల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: చుట్టూ ఉప్పునీరే ఉన్న రాజోలు దీవిలో తాగునీటికి ప్రస్తుత వేసవి గండమేనని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజోలు దీవిలోని ప్రధాన తాగునీటి భారీ ప్రాజెక్టు అయిన గుడిమెళ్లంక రిజర్వాయరు వద్ద ఉన్నతాధికారులతో మంగళవారం తాగునీటి సరఫరా తీరుపై సమీక్షించారు. తొలుత ప్రాజెక్టు పరిశీలించిన ఆయన సమీక్షలో మాట్లాడుతూ ప్రాజెక్టుల వద్ద ప్రస్తుతం ఉన్న వనరులతో ప్రస్తుత వేసవిలో తాగునీటిని అందించగలగడం చాలా కష్టంతో కూడుకున్న పని అన్నారు. జలజీవన్‌ను ఇక్కడ సద్వినియోగం చేసుకోలేక పోయామని వాపోయారు. నియోజకవర్గంలో సుమారు 60 వేల గృహాలకు గాను 28 వేలు మాత్రమే ఇంటింటికీ కుళాయిలు వేయగలిగామని, మిగిలిన 32 వేల ఇండ్లకు ఎందుకు వేయలేకపోయామని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్‌కు తోడు రిజర్వాయర్ వద్ద మరో ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్ అవసరమని ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మైక్రోఫిల్టర్లు కూడా సరిపోవడం లేదన్నారు. జలజీవన్‌లో నిర్మాణం చేసిన అన్ని ట్యాంకులకు నీటిని ఎందుకు సరఫరా చేయలేకపోతున్నామని సమీక్షించారు. దీనిపై ట్రాన్స్‌కో ఏడీఈ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మరో 160 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వేయాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే దేవ ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. పంపింగ్‌లో జరుగుతున్న ఇబ్బందులను ఆర్‌డబ్ల్యూస్ డీఈ రాజన్ వివరించారు. పైప్ లైన్ల వాల్వ్‌లు విప్పి గ్రామాల్లో నీరు మళ్లించడం వల్ల వేగం తగ్గి ట్యాంకులకు పంపింగ్ జరగడం లేదని పేర్కొన్నారు. గ్రామాల్లో పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా సిబ్బందితో పాటు లైన్ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వచ్చే రెండు నెలలూ చాలా కీలకమని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి నీటిని అందించాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన నీటి సరఫరా చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగి ప్రస్తుత వేసవిలో వేసవి గండం నుంచి గట్టెక్కాలని సూచించారు. గుడిమెళ్లంక ప్రాజెక్టుకు రూ.5 కోట్ల గ్రాంటు మంజూరు కోసం ప్రయత్నిస్తున్నట్లు త్వరలోనే మంజూరువుతాయన్నారు. ధవళేశ్వరం ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, దిరిశాల బాలాజీ, గంటా నాయుడు, చాగంటి స్వామి, సర్పంచ్ చెల్లుబోయిన హెలీనా, రాపాక నవరత్నం, ట్రాన్స్‌కో ఏఈ బొలిశెట్టి ప్రసాద్, తిరుమల బాబి, అడబాల యుగంధర్, బోనం చంటి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానించాలి



యంద్ర నారాయణరావు

ఆలమూరు: ఉపాధి హామీ పథకాన్ని కోస్తా ప్రాంతాల వెంబడి వ్యవసాయానికి అనుసంధానం చేయాలని గుమ్మిలేరుకు చెందిన రైతు సమాఖ్య ప్రతినిధి యంద్ర నారాయణరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం రబీ సీజన్‌కు సంబంధించి వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. రైతులకు ఈ సమయంలో కూలీల కొరత అధికంగా ఉందన్నారు. దీనివల్ల రైతులు పడుతున్న ఇబ్బందుల తొలగింపులో భాగంగా వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని అనుసంధానిస్తే రైతులకు కొంత మేర ఊరట కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై ఇప్పటికే జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ అన్ని ప్రభుత్వ అధికారులకు వినతి పత్రాలను అందజేసినట్లు రైతు సంఘ ప్రతినిధి నారాయణరావు తెలిపారు.

రెండు తువ్వ మట్టి లారీలు సీజ్

పి.గన్నవరం: ప్రభుత్వ అనుమతులు ముగిసినప్పటికీ మానేపల్లి లంక నుంచి పెదకందాలపాలెం మీదుగా మంగళవారం రాత్రి అక్రమంగా తువ్వ మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్ లారీలను సీజ్ చేసినట్టు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యన్నపు డాంగే తెలిపారు. మానేపల్లిలంకలో మట్టి తవ్వకాలకు ఈనెల 10వ తేదీతో అనుమతులు ముగిశాయి. అయినప్పటికీ అక్రమంగా తువ్వ మట్టిని తరలిస్తున్నారు. ఆర్ఐ వెంట వీఆర్వో నాగన్న ఉన్నారు.

ఆక్రమణల తొలగింపు

ఆలమూరు: చొప్పెల్లలో మంగళవారం ఆక్రమణల తొలగింపు జరిగింది. ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణలో భాగంగా ఎంపీడీఓ ఎ.రాజు, పంచాయతీ కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ ఈ ఆక్రమణల తొలగింపును చేపట్టింది. ఇప్పటికే ఆ రోడ్డులో గుర్తించిన ఆక్రమణలను జేసీబీల సాయంతో రోడ్డుకు ఇరువైపులా తొలగించారు. స్థానిక మహాలక్ష్మి అమ్మవారి చెరువు వద్ద నుంచి జాతీయ రహదారి వరకూ ఈ తొలగింపు ప్రక్రియ జరుగుతుంది.